# స్వార్థం



**సాయంత్రం అయిదుంబావుకల్లా ఆఫీసు నుంచి ఇంటి కొచ్చాడు రామ్మూర్తి స్కూటర్‌మీద.**

అప్పటికే పకోడీలు వండి, డైనింగ్ టేబుల్ మీద ఆజీలుగా ఉంచింది భార్య రమణమ్మ

పిల్లలు ఆడుకోవడానికి పక్కింటి కెళ్లారు.

రామ్మూర్తి పకోడీలు తింటూంటే, ఏదో ఘనకార్యం చేసిన దరహాసంతో పక్కనే కూర్చుంది రమణమ్మ

'ఏమిటే విశేషాలు ?' అన్నట్టు భార్యకేసి కుతూహలంగా చూశాడు రామ్మూర్తి.

"ఇందాక వెంకట సుబ్బయ్య కిరాణా కొట్లో సరుకులు తెచ్చానండీ. మొత్తం అరవై రూపాయల అరవై పైస లైనాయి. కాని మనకు ఆరు రూపాయలు గిట్టుబాటైంది. ఎల్లాగో చెప్పకోండి చూద్దాం" అన్నదామె కనుబొమల్లో గర్వాతిశయాన్ని ప్రదర్శిస్తూ.

"అదీ నువ్వే చెప్పు. ఇంతలో అంత సస్పెన్సు దేనికీ" అన్నాడు రామ్మూర్తి పకోడీల ప్లేటును ఖాళీ చేస్తూ

రమణమ్మ కాఫీ తెచ్చి యిచ్చింది.

"ఒక సబ్బు పేకెట్‌కు ధర కట్టడం మర్చిపోయాడు వెంకట సుబ్బయ్య. నేను కనిపెట్టాను అయినా చెప్పలేదు అమ్మే వాడు జాగ్రత్తగా ఉండాలిగానీ, కొనేవాళ్ల దేముంది ? .."

"యు ఆర్ ఫర్‌ఫెక్ట్లీ కరెక్ట్. భేష్టయిన పని చేశావు!" అన్నాడు రామూర్తి భార్య నిర్వాహకాన్ని భలేగా మెచ్చుకొంటూ

"తర్వాత కనుక్కొని ఇంటికి కుర్రాణ్ణి పంపిస్తాడేమో !" అన్నది రమణమ్మ అనుమానంగా

"ఆఁ! వాడికి గుర్తు రాబోయిందా ? ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేముందే వాడి కొట్లో సిగిరెట్లు ప్యాకెట్టుకొన్నాను వెంకట సుబ్బయ్యే ఇచ్చాడు నా దగ్గర ఆ ప్రస్తావనేమీ తీసుకురాలేదే !" అన్నాడు రామ్మూర్తి

"అయితే మర్చిపోయే వుంటాడు" అన్నది రమణమ్మ అనుమానం కాస్త తీరగా.

రామ్మూర్తి కాఫీ త్రాగి సిగిరెట్టు ముట్టించాడు అంతలో 'సార్' అంటూ ఇంటి గేటు ముందు కేక వినిపించింది

వెంకటసుబ్బయ్య కిరాణాకొట్లో కుర్రాడు వచ్చాడు

రమణమ్మ గుండెల్లో రాయి పడ్డంత పనైంది.

"ఏమిటోయ్ !" అన్నాడు రామ్మూర్తి తెచ్చిపెట్టుకొన్న గంభీరతతో. అవసరమైతే తన భార్య ఆ సబ్బు పేకెట్ తీసుకురాలేదనే అబద్ధం ఆడటానికి సంసిద్ధుడై.

రమణమ్మ బయటకు తొంగిచూసింది గానీ, ధైర్యంగా బయటకు రాలేకపోయింది.

"ఏం లేదు సార్ ! ఇందాక మా కొట్లో మీరు సిగిరెట్లు పెట్టె కొన్నారంట. అయిదు రూపాయలకు బదులు ఆరు రూపాయలు ఇచ్చారంట మీరిచ్చిన అయిదురూపాయల నోటు మడతలో ఓ రూపాయికూడా వుందట. ఇదు గోండి — ఆ రూపాయి మీ కిచ్చిరమ్మన్నారు. కొనేవాళ్లు అజాగ్రత్తగా వున్నా, మేము జాగ్రత్తగానే వుంటాం సార్" అన్నాడు కుర్రవాడు ఆ రూపాయినోటు యిస్తూ.

రామ్మూర్తి ఆ నోటు అందుకొంటూ— "మీ సేఠ్‌గారు నిజాయితీగల వ్యాపారస్తుడోయ్ ! అందరూ అట్లా వుంటే లోకం బాగుపడుతుందోయ్. ఈ రోజుల్లో బిజినెస్ చేసేవాళ్లల్లో ఇంత నీతీ న్యాయాలు వున్నాయంటే నిజంగా చెప్పకోవాల్సిందే ! మీ సేఠ్‌గారికి నా థాంక్స్ చెప్పు" అన్నాడు రామ్మూర్తి.

— అంతేగానీ, సబ్బు పాకెట్ వూసెత్తలేదు రామ్మూర్తి.